సైనికుల సేవలు వెలకట్టలేనివి

ప్రజాశక్తి-కడప : దేశ రక్షణలో ప్రాణాలను సైతం ఫణ్ణంగాపెట్టి సాయుధ దళాల సైనికులు చేస్తున్న సేవలు వెలకట్టలేనివని కలెక్టర్ వి.విజయ్ రామరాజు అన్నారు. సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని పురస్కరించకుని గురువారం స్థానిక కలెక్టరేట్‌లో సైనిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సాయుధ దళాల నిధికి విరాళాల సేక రణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సాయుధ దళాల పతాక దినో త్సవ నిధికి తమ వంతు బాధ్యతగా కలెక్టర్ మొదటి విరాళం అందజేశారు. జిల్లా లోని సైనికులు, మాజీ సైనికులు, వారి కుటుంబ సభ్యులకు జిల్లా కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశ భద్రతా చర్యల్లో భాగంగా దేశ సరిహద్దులలో ఎంతోమంది సైనికులు తమ ప్రాణత్యాగం చేశారని వారికి దేశప్రజలు వారికెంతో రుణపడి ఉన్నారన్నారు. ఆనంతరం జెసి గణేష్ కుమార్, డిఆర్ఓ గంగాధర్ గౌడ్ సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి తమ వంతు బాధ్యతగా విరాళాలను సమర్పించారు.

జగనన్న గృహ ప్రవేశాలకు కసరత్తు

జిల్లాలో జగనన్న ఇళ్ల గృహ ప్రవేశాలకు కసరత్తు ఊపందుకుంది. డిసెంబర్ నాటికి గణనీయ సంఖ్యలో గృహ ప్రవేశాలు చేయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలకు ఆదేశాలు జారీచేసింది. హౌసింగ్ జిల్లా యంత్రాంగం మండలాల వారీగా లక్ష్యాలను నిర్దేశించుకుంది. కలెక్టర్ పలు శాఖలకు చెందిన జిల్లా ఉన్నతాధికారులను ఆయా మండలాలకు, నియోజకవర్గాలకు ప్రత్యేక అధికారులుగా నియమించి పకడ్బందీ ప్రణాళికతో జగనన్న కాలనీల్లో లక్షిత ఇళ్ల పనుల లక్ష్యాన్ని అందుకోవడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారు. నిర్దేశిత లక్ష్యానికి, ఆచరణలో ఇళ్ల నిర్మాణ పనుల మధ్య గల వ్యత్యాసం అగాథాన్ని తలపిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది.

- ఫిబ్రవరి నాటికి 24 వేల ఇళ్లు
- 60 రోజులు.. 22 వేల ఇళ్లు!
- డిసెంబర్ నుంచి మెగా డ్రైవ్

మామిళ్లపల్లె లే అవుట్‌లో అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలు (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి- కడప ప్రతినిధి

జిల్లాలో 529 హౌసింగ్ లేఅవుట్లు ఉన్నాయి. 1.00128 లక్షల గృహాలను నిర్మించడమే ధ్యేయంగా గృహనిర్మాణశాఖ కసరత్తు చేపట్టింది. 94 వేల ఇళ్లకు రిజిస్ట్రేషన్ చేసింది. 2022, 23 సంవత్సరాల్లో వరదలు, నిధుల లేమి కారణంగా పనుల్లో పురోగతి మందగించింది. 2024 సార్వత్రిక ఎన్నికలు తరుముకొస్తున్న నేపథ్యంలో జగనన్న ఇళ్ల ప్రవేశాలు చేపట్టాలని భావించింది. నిర్దేశిత లక్ష్యాల దిశపై దృష్టి సారించింది. 2024 ఫిబ్రవరి నాటికి 24 వేల ఇళ్లను పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేసింది. దీనిపై హౌసింగ్ యంత్రాంగం మల్లుగుల్లాలు పడుతుండడం గమనార్హం.

డిసెంబర్ నుంచి మెగా డ్రైవ్

ఈ ఏడాది ఫిబ్రవరి నాటికి 24 వేల ఇళ్లను ప్రారంభించాలని హౌసింగ్ లక్ష్యాన్ని పెట్టుకుంది. కలెక్టర్ పర్యవేక్షణలో కసరత్తు చేపట్టింది. ఆచరణలో రెండు వేల ఇళ్లను మాత్రమే పూర్తి చేసింది. 10 వేల ఇళ్లలోపు నిర్మాణ పనులు చేపట్టింది. ప్రభుత్వ ఆదేశాల నేపథ్యంలో జిల్లాలోని 36 మండలాల వారీ పకడ్బందీగా లక్ష్యాలను నిర్దేశించుకుంది. ఈ ఏడాది డిసెంబర్ ఒకటి నుంచి 2024 ఫిబ్రవరి వరకు మెగాడ్రైవ్ నిర్వహిస్తోంది. మండలాల వారీగా నిర్దేశిత లక్ష్యాలకు నిర్దేశించింది. మండల స్థాయి అధికారులకు అవసరమైన సహాయ, సహకారాలను అంది ంచాలని నిర్ణయించింది. బిల్లుల చెల్లింపు నుంచి ఇసుక, ఇటుకలు, సిమెంట్ వంటి ఇతర మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించింది.

60 రోజులు..22 వేలు

రెండు నెలల వ్యవధిలో 22 వేల ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయడమేమిటనే సందేహం కలుగుతోంది. ఐదేళ్ల వ్యవధిలో ఇప్పటివరకు 10 వేల ఇళ్ల నిర్మాణ పనుల్లో పురోగతిని సాధించిన అనుభవాల నేపథ్యంలో సందేహం కలగడం గమనార్హం. మిగిలిన గృహ లబ్ధిదారులు నిర్మాణ వ్యయం పెరిగిన నేప థ్యంలో గృహ నిర్మాణ పనులకు ముందుకు రాకపోవడం, కొన్ని ప్రాంతాల్లో కోర్టు కేసుల సమస్యలు వంటి కారణాలతో పురోగతి మందగించినట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రి నియోజకవర్గ పరిధిలోని సింహాద్రిపురం, లింగాల, తొండూరు మండలాల్లో ఇళ్ల నిర్మాణ పనుల్లో ఆశించిన పురోగతి కనిపించడం లేదనే వాదన వినిపిస్తోంది.

బద్వేల్, మైదుకూరుల్లో ఆశాజనకం

జిల్లాలో బద్వేల్ నియోజకవర్గ పరిధిలోని 45 శాతం మేరకు పనుల్లో పురోగతి కనిపిస్తోంది. 11,395 ఇళ్ల నిర్మాణాలకు గానూ 4,890 ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావడం ఊరట కలిగిస్తోంది. పోరుమామిళ్ల, రంగసముద్రం, అక్కలరెడ్డిపల్లి వంటి ప్రాంతాల్లో పలు సమస్యలు పురోగతి వేగాన్ని కుంగదీసింది. మైదుకూరు నియోజకవర్గంలోని 50 శాతం పనులతో ముందుకు కదలడం ఉపశమనం కలిగించింది. 7,782 ఇళ్ల నిర్మాణ పనుల్లో 4,053 ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయడం మినహా మిగిలిన నియోజక వర్గాల్లో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉండడం గమనార్హం. కలెక్టర్ ప్రత్యేక అధికారులతో కూడిన జిల్లా యంత్రాంగం దృష్టి సారించింది. అయినప్పటికీ జగనన్న ఇళ్ల కాలనీల్లో గృహ నిర్మాణాల్లో ఆశించిన పురోగతి కనిపించకపోవడం గమనార్హం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పక్కాగృహాలను పూర్తిగా ఉచితంగా నిర్మించి ఇస్తామని చెప్పడం, అనంతరం ఇంటి నిర్మాణ పనులకు తక్కువ మొత్తాలను కేటాయించడం వంటి పరిస్థితుల నేపథ్యంలో జిల్లా హౌసింగ్ యంత్రాంగం నిర్దేశించుకు న్న లక్ష్యాలను అందుకోవడంపై సందేహాలు నెలకొన్నాయని చెప్పుకోవచ్చు.

నష్టపోయిన రైతులను ఆదుకోకపోతే ఆందోళన తప్పదు

అరటి రైతులకు ఎకరానికి రూ.2 లక్షలివ్వాలి
సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్

తుపాన్‌కు నేలమట్టమైన అరటి పంటను పరిశీలిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

జిల్లాలో మిచౌంగ్ తుపాన్ వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోకపోతే ఆందోళన తప్పదని సిపిఎం జిల్లా కార్యదర్శి జి చంద్రశేఖర్ హెచ్చరించారు. గురువారం మండలంలోని కొత్తపల్లెలో నేలమట్టమైన అరటి తోటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తుపాన్ కారణంగా అరటి తోట మొత్తం నేలమట్టం అయిందని బాధిత రైతులను ప్రభుత్వం పూర్తి స్థాయిలో ఆదుకోవాలన్నారు. ఎకరానికి రూ. 2 లక్షల చొప్పున నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి కేవలం ఆదేశాలకే పరిమితమయ్యారే తప్ప సహాయక చర్యలు చేపట్టలేదని వాపోయారు. రెండు, మూడు రోజులుగా ఎడతెరిపిలేని వర్షాల వల్ల రోజువారి కూలి చేసుకునే పేదలకు పూట గడవడమే కష్టంగా ఉందని అలాంటి వారికి భోజనం ఏర్పాటు చేయాల్సిన బాధ్యతను అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. జిల్లాలో ఆరా కొరగా సాగు చేసిన వరి, అరటి, ఆకుతోటలు, బొప్పాయి పంటలు పూర్తిగా చేలోనే నేలకొరిగాయని చెప్పారు. జిల్లాలో అక్కడక్కడా సాగుచేసిన మినుము, శనగ, ఉద్యాన పంటలు నేలబట్టమయ్యాయి అన్నారు. పత్తి పంట, పూల తోటలు పాడైపోయిందన్నారు. రైతు భరోసా కేంద్రాలలో రైతులకు అవసరమైన వ్యవసాయ యంత్రాలు అందుబాటులో ఉంటాయని చెబుతున్నప్పటికీ ఆచరణలో ఎక్కడా లేవని వరి కోత మిషన్లు యంత్రాలన్నీ వైసిపి నేతల ఇళ్లలో ఉన్నాయని విమర్శించారు. యంత్రాల అందుబాటులో ఉంటే సగానికి పైగా పంట నూర్పిడి సకాలంలో చేసుకునే వారన్నారు. దాన్యం కప్పు కోవడానికి, పట్టలు సరఫరా కూడా ప్రభుత్వం నిలిపేసిందని రైతులు ఆవేదన చెందుతున్నారని చెప్పారు. . తక్షణం ప్రభుత్వం దెబ్బతిన్న పంటల వివరాలను నమోదు చేసి పంటల బీమా, పెట్టుబడి రాయితీ, పరిహారాన్ని స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం చెల్లించాలని, తుపాన్ సహాయక చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. కార్య క్రమంలో ఎపి రైతు సంఘం కడప జిల్లా ప్రధాన కార్యదర్శి బి. దస్తగిరిరెడ్డి, వ్యవ సాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు నరసయ్య సురేష్ తోపాటు బాధిత రైతులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే ధ్యేయం : కలెక్టర్

మహిళా డ్రైవర్‌కు లైసెన్సు పత్రాన్ని అందజేస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి - కడప

మహిళాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మహిళా సాధికారత, ఆర్థిక స్వావలంభన దిశగా ముందుకు సాగుతోందని కలెక్టర్ వి.విజయ్ రామరాజు పేర్కొన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయ ఆవరణలో జిల్లాలో 11 మంది స్వయం సహాయక సంఘాల మహిళలకు ప్రభుత్వం మంజూరు చేసిన మహిళాశక్తి ఆటోలను సెర్ప్ పథకం ద్వారా కలెక్టర్ లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఉచిత డ్రైవింగ్ శిక్షణా లైసెన్స్ పత్రాలను లబ్ధిదారులకు అందజేసి మంజూరైన ఆటోలను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఉన్నతి - మహిళాశక్తి పథకం కింద ఎస్‌సి, ఎస్‌టి పేద మహిళలకు 2023- 24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిల్లాలో 11 మంది మహిళలకు వడ్డీ లేని రుణాల ద్వారా మంజూరైన ఆటోలు అందజేశామన్నారు. ఈ పథకం ద్వారా 10 శాతం లబ్ధిదారు వాటా చెల్లించగా. మిగిలిన 90 శాతం వడ్డీ లేని రుణాన్ని ప్రభుత్వం బ్యాంకుల సహకారంతో అందిస్తోందన్నారు. ఈ రుణాన్ని 48 కంతులలో తిరిగి చెల్లించాల్సి ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధి, మహిళా సంక్షేమం కోసం పాటు పడుతోందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను మహిళలు అర్హులందరూ సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలోపేతం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ ఎపిడి ప్రసాద్, కమ్యూనిటీ కో- ఆర్డినేటర్లు, ఏరియా కో-ఆర్డినేటర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

పదవ తరగతి మోడల్ పేపర్ల ఆవిష్కరణ

పదో తరగతి మోడల్ పేపర్లు ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

యుటిఎఫ్ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది ప్రచురించే పదవ తరగతి మోడల్ పేపర్ల ఆవిష్కరణ కార్యక్రమాన్ని గురువారం కడప యుటిఎఫ్ భవన్‌లో జిల్లా ప్రధాన కార్యదర్శి పాళెం మహేష్ బాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యుటిఎఫ్ విద్యారంగ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం మాత్రమేగాక ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని ప్రతి ఏడాదీ మోడల్ పేపర్ల ప్రచురణ నిర్వహిస్తుందని మోడల్ పేపర్ల రూపకల్పనలో నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో రూపొందించబడి అతి తక్కువ ధరకు తెలుగు, ఇంగ్లీష్ మీడియం విద్యార్థుల కోసం రూ.75 కే అన్ని సబ్జెక్టులు ఉండే విధంగా తయారుచేసి అందిస్తున్నామని తెలిపారు. ఈ మోడల్ పేపర్ ప్రాధాన్యతను పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్ కుమార్ సైతం ప్రశంసిస్తూ యుటిఎఫ్ విద్యార్థుల శ్రేయస్సుకు తన వంతు పాత్ర వహించడం ఎంతో ఆనందదాయకమైన తెలిపారు. గత సంవత్సరం పబ్లిక్ పరీక్షల్లో యుటిఎఫ్ రూపొందించిన మోడల్ పేపర్లలోని ప్రశ్నలు 80 శాతం పైగా వచ్చి రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు ఎంతో చక్కగా పరీక్షలు రాసి ఉత్తీర్ణులు అయ్యారని తెలిపారు. ఈ మోడల్ పేపర్లు కావలసినవారు కడప యుటిఎఫ్ భవన్‌లో, 9492805708లలో సంప్రదించగలరని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ నరసింహారావు సహాధ్యక్షురాలు సుజాత రాణి రాష్ట్ర కౌన్సిలర్ రూతు ఆరోగ్యమేరి జిల్లా కార్యదర్శి ఏజాస్ అహ్మద్ ఆడిట్ కమిటీ కన్వీనర్ ప్రభాకర్ నాయకులు బాబు,అనిల్ కుమార్,శివశంకర్ రెడ్డి, వీరనారాయణ, గోపీనాథ్ పార్థసారథి, జి వెంకటసుబ్బయ్య కిరణ్ బాబు, కరిముల్లా, శివ వరప్రసాద్, మహబూబ్ బాషా పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్ర ఎవరికోసం?' : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - బద్వేలు

ఆడుదాం ఆంధ్ర పేరుతో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని డివైఎఫ్ఐగా స్వాగతిస్తున్నామని అయితే ప్రభుత్వం క్రీడా మైదానాలు, కోచ్‌లు, పిఇటి పోస్టులు భర్తీ చేయకుండా ఎలా నిర్వహిస్తారని, కేవలం యువతను మోసగించడానికి నిరుద్యోగ సమస్యను పక్కదారి పట్టించే దానికయితే ఉపయోగం ఉండదని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ముడియం చిన్ని తెలిపారు. ఆడుదాం ఆంధ్రలో పాల్గొనే క్రీడాకారులకు దుస్తులు, క్రీడా సామగ్రి, రవాణా చార్జీలు ఇవ్వాలి అని డిమాండ్ చేశారు. స్థానిక బద్వేల్ పట్టణంలోని సుందరయ్య భవనం నందులో ఎన్నికల ముందు క్రీడాకారుల గురించి గొప్పలు చెప్పిన జగన్ మోహన్ రెడ్డి అధికారంలోకి రాగానే వైఎస్ఆర్ ప్రోత్సాహక బహుమతులు ఇస్తామని హామీ ఇచ్చి నాలుగు సంవత్సరాలు అయినా ఇప్పటికీ 80 శాతం మంది క్రీడాకారులకు బహుమతులను అందించలేదని పేర్కొన్నారు. జిల్లాలో ఇప్పటికే ఆడుదాం ఆంధ్ర కోసం యువత రిజిస్ట్రేషన్లు చేసుకుంటున్నారని. కానీ వ్యాయామ ఉపాధ్యాయులు న్యాయ నిర్ణేతలుగా చెప్పడానికి దాదాపు 250 మంది కొరతగా ఉన్నారని తెలిపారు. ఆటలకు సమగ్ర నిర్ణయం రావాలంటే నిపుణులు అయిన వ్యాయమ ఉపాధ్యాయులే సరైన వారన్నారు. వారి స్థానంలో వాలంటీర్లకు న్యాయ నిర్ణేతలుగా ఏర్పాటుచేయడం గమనార్హమన్నారు. 350 సచివాలయాల పరిధిలో ఆటలు నిర్వహిస్తున్నామని అధికారులు చెబుతున్నారు. కడప జిల్లాలో ఇంతమంది క్రీడాకారులకు సరిపడా క్రీడా మైదానాలు లేవన్నారు. మరో వైపు గ్రామీణ ప్రాంతాలలో ఇప్పటికే క్రీడా మైదానాలు అనేకం ఆక్రమణకు గురయ్యాయన్నారు. ఆటలు ఆడటానికి సరిపడా మైదానాలు లేవని వాపోయారు. పే అండ్ ప్లే విధానంతో ఇప్పటికే స్టేడియాలను ప్రయివేట్ వారికి అప్పజెప్పారన్నారు. క్రీడలకు బడ్జెట్లో ఎంత కేటాయించారని ప్రశ్నించారు. ఇప్పటికైనా పభుత్వం ఆడుదాం ఆంధ్రాలో పాల్గొనే క్రీడాకారులందరికీ అన్ని వసతులు ఉచితంగా కల్పించాలని, కోచ్‌ల ను రెగ్యులర్ చేసి వారిపై పే అండ్ ప్లే టార్గెట్లను ఉపసంహరిం చుకోవాలని, క్రీడలకు ప్రతి బడ్జెట్లో నిధులను కేటాయించాలని డిమా ండ్ చేశారు. లేనిపక్షంలో ఆడుదాం ఆంధ్రాలో పాల్గొనే యువతి యువకులతో కలిసి ఉద్యమించాల్సి వస్తుందని హెచ్చరించారు.

పార్టీ బలోపేతానికి కృషి

పాదయాత్ర నిర్వహిస్తున్న విజయమ్మ, టిడిపి నాయకులు, కార్యకర్తలు

ప్రజాశక్తి-కలసపాడు

నియోజకవర్గంలో టిడిపి బలో ఎతం చేసి రాబోయే ఎన్నికల్లో పార్టీని అధికా రంలోకి తెచ్చేందుకు అందరమూ కృషి చేయాల్సిన అవసరముందని మాజీ ఎమ్మెల్యే విజయమ్మ కుమారుడు రితేష్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం నియోజకవర్గ అభ్యర్థి రోషన్న, ఏడు మండలాల టిడిపి కార్య కర్తలు, బూత్ కన్వీనర్లు, మండల పార్టీ నాయ కులతో కలిసి మండలంలోని గంగాయపల్లె నుంచి అట్లూరు క్రాస్ రోడ్డు వరకు ఆయన పాదయాత్రను ప్రారం భించారు. ఈ సందర్భంగా రితేష్‌రెడ్డి మాట్లాడుతూ తన తాత బిజివేముల వీరారెడ్డి ఆశయ సాధన కోసమే పాదయాత్ర నిర్వహిస్తున్నామన్నారు. నియోజవర్గ అభ్యర్థి అయిన రోషన్నను గెలిపి ంచేందుకు అందరమూ కలిసి కట్టుగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్ర మంలో మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, టిడిపి మండల అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, చింత లపల్లె సర్పంచ్ సాధన కారి రంతు, మండల ప్రత్యేక సలహాదారులు నాగేశ్వరరావు, ఈశ్వ ర్‌రెడ్డి, రామాంజనేయరెడ్డి, భాస్కర్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి , రామాపురం వీరారెడ్డి ,రసూల్, తంబళ్లపల్లె, నారాయణరెడ్డి, గంగాయి పల్లె ఓబులేష్, పాత రామాపురం వెంకట సుబ్బారెడ్డి, రంగయ్య, లింగారెడ్డి పల్లె ఏడు మండలాల నాయకులు పాల్గొన్నారు..

పోలీస్ ఆరోగ్య భద్రత స్కీమ్‌ను ప్రారంభిస్తున్న ఎస్‌పి సిద్ధార్థ్ కౌశల్

మెరుగైన వైద్య సేవలు అందించాలి

పోలీస్ ఆరోగ్య భద్రత స్కీమ్ ప్రారంబోత్సవంలో ఎస్‌పి సిద్ధార్థ్ కౌశల్

ప్రజాశక్తి - కడప సిటీ

పోలీసులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎస్‌పి సిద్ధార్థ్ కౌశల్ పేర్కొన్నారు. గురువారం స్థానిక అరుణాచల ఇన్సిట్యూట్ ఆఫ్ సైన్స్ ఆస్పత్రిలో పోలీస్ ఆరోగ్య భద్రత స్కీమ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ఆస్పత్రిలోని క్యాత్‌ల్యాబ్, ఆపరేషన్ థియే టర్, మెడికల్ ఐసియు, జనరల్ వార్డు లను పరిశీలించారు. అత్యాధునిక పరికరాలతో అందించే నాణ్యమైన వైద్య సేవలను ప్రరిశీలించారు. అనంతరం ఆస్పత్రి నిర్వాహకులు, ప్రముఖ డాక్టర్ ఆర్.నిరంజన్‌రెడ్డి ఆస్పత్రిలో అందించే వైద్యసేవల వివరాలను వివరించారు. ఆరోగ్యశ్రీ సేవలను తీరుతెన్నులను ఆరా తీయడం గమనార్హం. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు డాక్టర్ మమతేశ్వరి, సోహైల్ అహ్మద్, ఇతర వైద్యులు, ఆస్పత్రి పర్యవేక్షకులు కోటిరెడ్డి, పలువురు పోలీసులు పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం అందించాలి

సమావేశంలో మాట్లాడుతున్న మన్సూరు అక్బర్

ప్రజాశక్తి - కడప అర్బన్

మిచౌంగ్ తుపాను కారణంగా రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందని, ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికంగా నష్టపరిహారం చేయాలని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మన్సూర్ అక్బర్ డిమాండ్ చేశారు. గురువారం పాత బస్టాండ్‌లోని అక్బర్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి, పత్తి, మొక్కజొన్న, అరటి, టమోటా, ఉల్లి, మిర్చి పంటల్లో వరద నీరు చెరువులైపారుతున్నా రైతుల పక్షాన వైసిపి ఎమ్మెల్యేలు సందర్శించి రైతులకు అండగా నిలవకపోవడం బాధాకరమని చెప్పారు. ప్రభుత్వం తరుపున కలెక్టర్లు కాల్ సెంటర్లు ఏర్పాటు చేసినప్పటికీ ప్రజలు విశ్వసించలేదని తెలిపారు. ప్రభుత్వం తక్షణ సాయం కింద రూ.20 వేలు అందించాలని డిమాండ్ చేశారు. పంటల బీమా విషయంలో బాధ్యతగా వ్యవహరించి పూర్తి నష్టాన్ని భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అధికార ఎమ్మెల్యేలు ప్రభుత్వం పైన ఒత్తిడి తెచ్చి 48 గంటల్లో సాయం అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మైనారిటీ రాష్ట్ర కార్యదర్శి జి.నజీర్, టిడిపి నాయకులు ఆర్.హుస్సేన్, నాదెండ్ల దస్తగిరి, మంజూరు అహమ్మద్, బాబయ్య, యస్.ఇలియాస్ పాల్గొన్నారు.

ఎల్‌హెచ్‌ఎంఎస్ సేవలు వినియోగించుకోండి

కడప అర్బన్ : ఇళ్లకు తాళం వేసి ఊళ్లకు వెళ్లే సమయంలో ఎల్‌హెచ్‌ఎంఎస్ సేవలు వినియోగించుకోవాలని ఎస్‌పి సిద్దార్థ్ కౌశల్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జిల్లాలో దొంగతనాలు జరుగకుండా ఉండేందుకు అన్ని సబ్ డివిజన్ కమాండ్ కంట్రోల్ కేంద్రాల్లో కెమెరాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. బ్లూ కోల్ట్, రక్షక్ బృందాల సాయంతో వాటిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

9న పూర్వ విద్యార్థుల సమావేశం

కడప : కడపలోని ప్రభుత్వ పురుషుల కళాశాల ఏర్పడి 75 సంవత్సరాల కావస్తున్న సందర్భంగా 2023 సంవత్సరంలో వజ్రోత్సవాలు నిర్వహించాలని కళాశాల నిర్ణయించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ జి. రవీంద్రనాథ్ తెలిపారు. కళాశాలలో ఇంటర్/డిగ్రీ చదివిన పూర్వ విద్యార్థులందరూ ఈనెల 9న రెండవ శనివారం కళాశాలలో పూర్వ విద్యార్థుల సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశానికి పెద్ద సంఖ్యలో పూర్వ విద్యార్థులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

10న జిల్లా స్థాయి చెస్ టోర్నమెంట్

ప్రజాశక్తి-కడప : కుళ్లాయప్ప మెమోరియల్ జిల్లాస్థాయి ఓపెన్ ప్రైస్ మనీ చెస్ టోర్నమెంట్ ఈనెల 10న కడప నగరంలోని మస్తాన్‌వల్లి వీధిలో ఉన్న హాల్ ఆఫ్ చెస్‌లో నిర్వహిస్తున్నట్లు జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి అని దర్బారి ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి బహుమతిగా రూ. 1500, రెండవ బహుమతిగా రూ. 1000, మూడవ బహుమతిగా రూ. 600, నాలుగవ బహుమతిగా రూ. 400 ఐదవ బహుమతిగా రూ. 300 ఇవ్వనున్నామన్నారు. దీంతోపాటు ఒకటి నుంచి పది స్థానాలు సాధించిన వారికి ట్రోఫీలు అందజేస్తామన్నారు. పూర్తి వివరాలకు 8341255 151లో సంప్రదించాలన్నారు.

వైసిపి ప్రభుత్వంపై వ్యతిరేకత పెరిగింది

కరపత్రం పంపిణీ చేస్తున్న శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

వైసిపి ప్రభుత్వంపై వ్యతిరేకత పెరిగిపోయిందని టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు ఆర్. శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం మూడవ డివిజన్‌లో 'బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ' అనే కార్యక్రమం నిర్వహి ంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడును గెలిపించేందుకు ప్రజలు ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమని తెలిపారు. వైసిపి ప్రభుత్వాన్ని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని చెప్పారు. ప్రజలు ఎన్నికలు ఎప్పుడెప్పుడు వస్తాయని ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. నగరం రోడ్లు, డ్రెయినేజీ అస్తవ్యస్తంగా మారిపోయిందని చెప్పారు. ప్రజా సమస్యలను స్థానిక ఎమ్మెల్యే గాలికి వదిలేశారని విమర్శించారు. నామ్ కే వాస్తే డిప్యూటీ సీఎం పదవి అన్నారు. రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి ప్రజలు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఆప్కాస్ రాష్ట్ర డైరెక్టర్‌ను కలిసిన ఎస్ఎఫ్ఐ నాయకులు

పోరుమామిళ్ల : మండలంలోని స్థానిక ఆప్కాస్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తిని ఎస్ ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి వీరపోగు రవి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సంద ర్భంగా ఆస్కాస్ స్టేట్ డైరెక్టం మాట్లాడుతూ విద్యారంగంలోని సమస్యల పైన నిరం తరం భారత విద్యార్థి ఫెడరేషన్ కృషి చేస్తుందని పేర్కొన్నారు. 51 ఏళ్ల నుంచి ఇప్పటి వరకు ఎన్నో విజయాలు సాధించిన చరిత్ర ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘానికి ఉందని పేర్కొన్నారు. విద్యార్థులతో కలిసిపోతూ వారి సమస్యల మీద పోరాడుతూ ఎస్ఎఫ్ఐ చేస్తున్న కృషి మరువలేనిదన్నారు. మరెన్నో విజయాలు నాయకత్వం సాధించాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి కరిష్మా మండల నాయకులు చారి, ప్రేమ్ , విజయ భాస్కర్,వంశీ, గీత, మహాలక్ష్మి పాల్గొన్నారు.

దెబ్బతిన్న వరిని పరిశీలించిన శాస్త్రవేత్తలు

వల్లూరు : తుపాన్ ప్రభావంతో దెబ్బతిన్న వరి పంటను శాస్త్ర వేత్తలు గురువారం పరిశీలించి రైతులకు సూ చనలు చేశారు. మం డల పరిధిలోని ఇసుక పల్లిలో అగ్రికల్చర్ రీసెర్చ్ సెంటర్ సైంటిస్టులు జాన్సన్, సునీల్‌కుమార్ వరి పంటను పరిశీలించి కోతకు వచ్చిన పంటకు, నెలకు ఒరిగిన వరి పైరు మీద ఐదు శాతం ఉప్పు ద్రావణం పిచికారి చేసుకుంటే ధాన్యంపై మొలక రాకుండా ఉంటుందని సూచిం చారు. వరికుప్పలో కూడా 20 కేజీల ఉప్పు వేసుకుంటే వరి ధాన్యాన్ని కాపాడుకోవచ్చు అన్నారు. మండల వ్యవసాయ అధికారి సాయి జ్యోతి, సహాయకురాలు రైతులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతుల్లో ఆత్మస్థైర్యం నింపాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

విభిన్న ప్రతిభావంతుల్లో ఆత్మస్థైర్యం నింపాలని జిల్లా మైనారిటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ వల్లూరి బ్రహ్మయ్య, కడప మండల విద్యాశాఖ అధికారి పాలెం నారాయణ పేర్కొన్నారు. గురువారం నగరంలోని భవిత కేంద్రంలో విభిన్న ప్రతిభావంతుల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులను తీర్చిదిద్దే బాధ్యత పిల్లల తల్లిదండ్రులు, ప్రత్యేక విద్య ఉపాధ్యాయులదేనని చెప్పారు. . శారీరక, మానసిక అవరోధాలను ఎదిరించి పోటీ పరీక్షలలోనూ సాహస కృత్యాలలోనూ ఆటలలోనూ ఎందరో సత్తా చాటారని ఉదహరించారు. దివ్యాంగులు తమ పనులు తాము చేసుకోవడానికి శిక్షణ ఇవ్వడమే గాక వారిలోని సామర్థ్యాలను వెలికి తీసి ప్రతిభావంతులుగా మార్చాల్సిన అవసరం ఉందన్నారు. దివ్యాంగుల ప్రగతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపడుతున్నాయని, వారికి అవసరమైన ఉపకరణాలు అందించడం ఫిజియోథెరపీ వైద్య సేవలు కల్పించడం ప్రత్యేక విద్యను అందించడం చేస్తున్నారన్నారు. ప్రోత్సాహం అందిస్తే అవయవలోపం ఎవరికి అడ్డు కాదన్నారు. దివ్యాంగుల తల్లిదండ్రులు ఎంతో ఓపికతో పిల్లల మానసిక శారీరక ఎదుగుదలకు సహాయపడవలసిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష అధికారులు ధనలక్ష్మి, దశరథ రామిరెడ్డి, విశ్వనాథరెడ్డి, ఉమ్మడి రమణమూర్తిలు విద్యార్థులకు బహుమతులను పంచిపెట్టారు. ఐఈ ఆర్పి లు విజయమ్మ, సిద్ధారెడ్డి, పిల్లల తల్లి దండ్రులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

పంట పొలాలను పరిశీలిస్తున్న వైసిపి నాయకులు

పంట నష్టం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం

ప్రజాశక్తి - ఖాజీపేట

తుఫాన్ ప్రభావం వల్ల మండలంలో దెబ్బతిన్న పంట నష్టాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, రైతులను ఆదుకుంటామని అగ్రహారం సహకార సంఘం అధ్యక్షుడు రాఘవరెడ్డి, వైసిపి మండల కన్వీనర్ దుగ్గిరెడ్డి మురళీమోహన్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని కూనవారిపల్లె పరిసర ప్రాంతాల్లో తుఫాన్ ప్రభావంతో వర్షం కారణంగా దెబ్బతిన్న పంట పొలాలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దని పరిహారం అందేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ భూమన సుబ్బారెడ్డి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

పరిపాలన చేతకాని ప్రభుత్వం

- పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

వైసిపి ప్రభుత్వం పరిపాలన చేతకానిదని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి అన్నారు. వేంపల్లెలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం భూమి ఇవ్వని కారణంగా విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటు కాలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వాటాగా ఇవ్వాల్సిన నిధులు ఇవ్వకపోవడంతో కడప-రాయచోటి-మదనపల్లె-బెంగులూరు నూతన బ్రాడ్‌గేజ్ పనులు నిలిచిపోయాయని తెలిపారు. యుటిలైజేషన్ సర్టిఫికేట్ ఇవ్వని కారణంగా 2023-2024 ఆర్థిక సంవత్సరానికి క్యాపిటల్ పెట్టుబడి కింద కేంద్రం నుండి రావాల్సిన నిధులు రాష్ట్రానికి రాలేదని పేర్కొన్నారు.. వరం కావాల్సిన పోలవరం జగన్ ప్రభుత్వ నిర్వాకంతో శాపంగా మారిందని విమర్శించారు. రాజధానిలేని రాష్ట్రంగా తయారైనట్లు తెలిపారు. తుఫాన్ బాధితులకు తిండి పెట్టలేని దద్దమ్మ ప్రభుత్వంలా ఉందన్నారు. తిరుమలలో భక్తులిచ్చిన విరాళాలతో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమంలో నాణ్యమైన భోజనం పెట్టలేని కక్కుర్తి ప్రభుత్వం ఇది అని విమర్శించారు. విభజన చట్టంలోని 13వ షెడ్యూల్ ప్రకారం రాష్ట్ర విభజన జరిగిన 6 నెలలలోపు రాష్ట్రంలో నూతన రైల్వేజోన్ ఏర్పాటు కావాలన్నారు. కాని తొమ్మిదిన్నర సంవత్సరాలైన ఏర్పాటు కాలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను అధికారంలోకి తేవడమే ఏకైక పరిష్కారమన్నారు.

మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ జగన్నాథ్

కులగణన సర్వేకు సహకరించండి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

కులగణన సర్వేకు అందరూ సహకరించాలని మున్సిపల్ కమిషనర్ పగడాల జగన్నాథ్ కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం మున్సిపల్ చైర్మన్ ఛాంబర్‌లో చైర్మన్ మూలే హర్షవర్ధన్‌రెడ్డి అధ్యక్షతన కౌన్సిలర్లు, కులపెద్దలు, మతపెద్దలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు ప్రతి ఇంటికి వచ్చి కులగణన సర్వే నిర్వహిస్తారని, వారికి తగిన సూచనలిచ్చి సర్వేకు పూర్తిగా సహకరించాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ ఉద్యోగులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసులకు సూచనలిస్తున్న డిఎస్‌పి శ్రీకాంత్

విధులను సక్రమంగా నిర్వహించాలి

ప్రజాశక్తి - కొండాపురం

పోలీసులు తమ విధుల విషయంలో ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా సక్రమంగా నిర్వహించాలని ట్రైనింగ్ డిఎస్‌పి శ్రీకాంత్ సూచించారు. కొండాపురం పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ పోలీసు బాధ్యత ఎంతో విలువలతో కూడుకున్నదని తెలిపారు. పోలీసులే ప్రజాస్వామ్య పరిరక్షణకు పట్టుకొమ్మలన్నారు. సమాజాన్ని చెడుదారిలో నడవకుండా చూడవలసిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు. విధుల నిర్వహణలో పోలీసులకు అనుకోని విధంగా సమస్యలు ఎదురైతే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. పోలీసులు ప్రజలతో స్నేహపూర్వకంగా నడచుకోవాలన్నారు. కార్యక్రమంలో సిఐ వి.వేణుగోపాల్, ఎస్ఐ యోగేంద్ర, పోలీసులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

అప్పులబాధతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

మండల కేంద్రంలోని బ్రహ్మసాగర్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్లు సమాచారం రావడంతో ఎస్ఐ విద్యాసాగర్ సిబ్బందితో సంఘటనాస్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని బయటకు తీయించారు. వచ్చిన సమాచారం మేరకు ప్రొద్దుటూరు గోకుల్ నగర్‌కు చెందిన పి.వెంకట జయదేవరెడ్డి (39)గా గుర్తించారు. ఇతనికి ఇద్దరు పిల్లలు. జీవనోపాధికి ఆయిల్‌మిల్ ఏర్పాటు చేసుకొని జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఎక్కువ అప్పులు కావడంతో బుధవారం బ్రహ్మసాగర్‌లో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు.

లారీలో చెలరేగిన మంటలు

ప్రజాశక్తి - ముద్దనూరు

ముద్దనూరు-జమ్మలమడుగు రహదారిలోని స్థానిక ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై గురువారం లారీలో మంటలు చెలరేగి క్యాబిన్ ధగ్ధమైంది. ఎస్ఐ చంద్రమోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చిన్నదుద్యాల గ్రామానికి చెందిన లారీ సిమెంట్ లోడుతో దాల్మియా సిమెంట్ కర్మాగారం నుండి బెంగళూరుకు వెళ్తుండగా అకస్మాత్తుగా లారీలో మంటలు లేచాయి. డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. జమ్మలమడుగు నుండి అగ్నిమాపక వాహనం చేరుకుని మంటలను అదుపు చేసింది.

యథేచ్ఛగా ఇసుక తరలింపు

- చోద్యం చూస్తున్న అధికారులు

ప్రజాశక్తి - చాపాడు

ఇసుక డంపింగ్ (ఫైల్ ఫొటో)

మండల పరిధిలోని పెన్నా నది నుండి ఇసుక అక్రమంగా తరలిపోతోంది. రాత్రి సమయాల్లో తిప్పిరెడ్డిపల్లె, రాజుపాలెం గ్రామాల నుండి ఇసుకను కొంతమంది తరలిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నాలుగు సంవత్సరాలుగా ఇసుక సరఫరా విధానంలో సమూల మార్పులు వచ్చాయి. ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్దేశించిన ప్రాంతాల్లో మాత్రమే ఇసుక క్వారీలను ఏర్పాటు చేశారు. ప్రారంభంలో మండల పరిధిలోని వెదురూరు, తిప్పిరెడ్డిపల్లె వద్ద ఇసుక క్వారీ అందుబాటులో ఉంచారు. అనంతరం దీన్ని పలు కారణాలతో మూసేశారు. అప్పటి నుంచి ప్రభుత్వ నిబంధనల ప్రకారం మీసేవ కేంద్రాల్లో ఇసుక కావాల్సిన వారు దరఖాస్తు చేసుకుంటే.. ఇతర ప్రాంతాల క్వారీల నుంచి సరఫరా చేశారు. ఆ తర్వాత కొన్ని నెలల నుంచి నూతన ఏజెన్సీల ద్వారా సరఫరా చేశారు. ప్రభుత్వ కార్యక్రమాలకు, వైఎస్ఆర్ గృహ నిర్మాణాలకు ఉచితంగా సరఫరా చేస్తూ వచ్చారు. ఇప్పుడు ఏజెన్సీకి కేటాయించిన సమయం ముగియడంతో రవాణా నిలిచిపోయింది. ఇదే అదునుగా కొంతమంది మండల పరిధిలోని పెన్నా నది నుండి రాత్రి వేళల్లో అక్రమంగా ఇసుక తరలింపు చేపడుతున్నారు. రాత్రి వేళల్లో అక్రమంగా ఇసుక తరలిస్తూ ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నా సంబందిత అధికారులు ఏమాత్రం పట్టించుకోకుండా మాముళ్ల మత్తులో వదిలేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. స్థానిక పోలీస్ సిబ్బంది ఇసుక రవాణాకు సహకరిస్తూ సొమ్ము చేసుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అడపాదడపా తనిఖీలు చేస్తూ ఉన్నతాధికారులకు అనుమానాలు రాకుండా జాగ్రత్త పడుతున్నట్లు తెలుస్తోంది. పెన్నా తీర గ్రామాల్లో ట్రాక్టర్ల ద్వారా ఇసుక అక్రమంగా తరలించి ఇతర ప్రాంతాలకు సరఫరా చేస్తున్నట్లు సమాచారం. అక్రమంగా ఇసుకను తరలిస్తే రూ.లక్ష జరి మానా, క్రిమినల్ కేసులు నమోదు వంటి కఠిన చర్యలు అమలులో ఉన్న ప్పటికీ స్థానికంగా అధికారులు పట్టించుకోవడంలేదు. దీన్ని ఆసరా చేసుకుని కొందరు యథేచ్ఛగా ఇసుక తరలింపు చేపడుతున్నట్లు తెలుస్తోంది. ఇసుక తరలింపు అధికారులకు తెలిసినప్పటికీ పట్టించుకోవడం లేదనే విమర్శలు వెలువడుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రాత్రి సమ యంలో అక్రమంగా తరలిస్తున్న ఇసుక రవాణాపై నిఘా పెంచి కట్టడి చేయాల్సి ఉంది.

రక్తదానం చాలా గొప్పది

రక్తదానంలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

ప్రజాశక్తి - వేంపల్లె

అన్ని దానాల్లో రక్తదానం గొప్పదని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చెరసాల యోగాంజనేయులు తెలిపారు. గురువారం స్థానిక వైఎస్ఆర్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెడ్ రిబ్బన్ క్లబ్, ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో భోగా పార్వతమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. రక్తదానం శిబిరంలో పలువురు విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్, రెడ్ రిబ్బన్ క్లబ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో గర్భిణులు, ప్రమాదాల్లో గాయ పడిన, రక్తహీనత ఉన్నవారికి రక్తం అవసరమన్నారు. ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ కళాశాల నుండి 30 మంది విద్యార్థులు రక్తదానం చేయడంలో చురుగ్గా పాల్గొన్నారని తెలిపారు. ఇది సమాజ పురోవృద్ధికి తోడ్పడుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో భోగా పార్వతమ్మ ట్రస్ట్ కో-ఆర్డినేటర్ వెంకటరమణ, డాక్టర్ మల్లేశ్వరమ్మ, డాక్టర్ నాగలక్ష్మిదేవి, డాక్టర్ సతీష్, డాక్టర్ సుగుణమ్మ, కంప్యూటర్ అధ్యాపకులు షఫీద్దీన్, కిరణ్మయి, రాజారెడ్డి, ప్రసాద్, లైబ్రేరియన్ మాధవరావు, ఫిజికల్ డైరెక్టర్ తేజేంద్ర, ట్రస్ట్ సిబ్బంది, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మంచిని ప్రజలకు వివరించాలి

ప్రజాశక్తి - చాపాడు

మాట్లాడుతున్న ఎంపిపి టి.లక్షుమయ్య

ప్రభుత్వ మంచిని ప్రజలకు వివరించాలని ఎంపిపి టి.లక్షుమయ్య సూచించారు. మండల పరిధిలోని ఎన్.ఓబాయపల్లెలో వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ పథకాల ద్వారా రూ.28.70 కోట్లు లబ్ధి చేకూరిందని తెలిపారు. నక్కలదిన్నె గ్రామంలో గురువారం ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని సచివాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను 99శాతం అమలు పరిచారని పేర్కొన్నారు. సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులు, వాలంటీర్లు సమన్వయంతో జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం గ్రామంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ శ్రీధర్‌నాయుడు, మండల నాయకులు మాజీ కెసి కెనాల్ డిస్ట్రిబ్యూటరీ చైర్మన్ సోముల మహేశ్వర్‌రెడ్డి, సర్పంచ్ అంజనమ్మ, ఈశ్వరమ్మ, పంచాయతీ కార్యదర్శి శ్రీనువాసులరెడ్డి, సచివాలయ కన్వీనర్లు శ్రీకాంత్‌రెడ్డి, గృహ సారథులు, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వాటర్ ప్లాంట్ ఏర్పాటు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

పట్టణ పరిధిలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పాఠశాల పూర్వ విద్యార్థి సాయినాథరెడ్డి (ఎన్ఆర్ఐ) తమ వైయస్సార్ ఫౌండేషన్ ద్వారా నూతన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఉచితంగా ఏర్పాటు చేశారు. దీన్ని గురువారం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ప్రారంభించారు. వాటర్‌ప్లాంట్ నిర్మాణానికి సహకరించిన సాయినాథ్‌రెడ్డిని పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు శాలువాలతో, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సన్మానసభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కష్టపడి చదివి మంచి ప్రయోజకులుగా తయారవ్వాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ జగన్నాథ్, మండల విద్యాశాఖ అధికారులు శివప్రసాద్, వెంకటేశ్వర్లు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామాంజనేయులురెడ్డి, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ బంగారు, ఉపాధ్యాయులు చంద్రఓబుల్‌రెడ్డి, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

విద్యార్థినికి కంటి అద్దాలను అందిస్తున్న డాక్టర్ సునీత

అంధత్వ నివారణకు అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పట్టణంలోని స్నేహిత అమృత హస్తం సేవాసమితి నేత్ర సేకరణ కేంద్రాన్ని గురువారం వైయస్ఆర్ కడప జిల్లా అంధత్వ నివారణ అధికారిణి డాక్టర్ సునీత, నేత్రసేకరణ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రవీంద్రరెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె నేత్ర సేకరణ కేంద్రం నుండి సేకరిస్తున్న కార్నియాలకు సంబంధించి రికార్డులు, అవగాహనా కార్యక్రమాల వివరాలు తెలుసుకున్నారు. ప్రజల్లో మరింతగా విస్తృతంగా అవ గాహనా కార్యక్రమాలు చేపట్టి అంధత్వ నివారణకు కృషి చేయాలన్నారు. అనంతరం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జగనన్న కంటి వెలుగు కార్యక్రమంలో విద్యార్థినులకు కంటి అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా అంధత్వ నివారణ సిబ్బంది సుధాకర్‌రెడ్డి, నేత్ర సేకరణ టెక్నీషియన్ హరీష్, సేవాసమితి పట్టణ అధ్యక్షులు మహమ్మద్ రఫీ, సభ్యులు రాజా పాల్గొన్నారు.

పందులు, కుక్కల సమస్య పరిష్కరించాలని ఫిర్యాదు

ఎర్రగుంట్ల : పట్టణంలోని 20వ కౌన్సిల్ వార్డు రాణి వనంలో పందులు, కుక్కల బెడద నానాటికి పెరుగుతోందని వార్డు కౌన్సిలర్ అలీ గురువారం మున్సిపల్ కమిషనర్ జగన్నాథ్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై పలుమార్లు ఫిర్యాదు చేసినా చర్యలు ఏమాత్రం లేకపోవడం బాధాకరమన్నారు. కుక్కలు దారిన పోయేవారిని వెంబడించి గాయపరుస్తున్నాయని, పందులు ఇంటి పరిసరాలను అపరిశుభ్రంగా చేస్తున్నాయని, వాటి వలన వార్డు ప్రజలు రోగాల బారిన పడుతున్నారని వివరించారు. వాటిని వెంటనే బయట ప్రాంతాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

క్రీడల్లో విద్యార్థులు రాణించాలి

ప్రజాశక్తి - చాపాడు

క్రీడల్లో విద్యార్థులు రాణించాలని కెసి కెనాల్ మాజీ డిస్ట్రిబ్యూటర్ చైర్మన్ సోముల మహేష్‌రెడ్డి సూచించారు. నక్కలదిన్నె ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం శ్రీరామ్ ఏకల్ అభియాన్ ఆధ్వర్యంలో క్రీడలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో సోముల అరుంధతి, ప్రధానోపాధ్యాయుడు శోభన్‌బాబు, మహిళ ఉపాధ్యక్షురాలు రమాదేవి, వెంకట సుజన, వేమన్నారాయణ, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు రౌండ్ టేబుల్ సమావేశం

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

పట్టణంలో ఎన్నో సంవత్సరాలుగా వితంతు కార్యం జరిపే ఊరబావి స్థలాన్ని నడివూరు రామాలయ అభివృద్ధికి కేటాయించడం విధితమే. ఊరబావి స్థలంలో వాణిజ్య కట్టడాలపై అఖిలపక్ష కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం మార్కెట్ యార్డ్ ఆవరణలో అఖిలపక్ష కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సమావేశానికి అన్ని పార్టీల ప్రజాప్రతినిధులు, ప్రజలు హాజరై తమ అభిప్రాయాలను తెలియజేయాలని అఖిలపక్ష కమిటీ సభ్యులు కోరారు.

ఇద్దరు పోలీసులు సస్పెన్షన్

ప్రజాశక్తి - కొండాపురం

మండలంలోని ఇద్దరు పోలీసులు సస్పెన్షన్‌కు గురైనట్లు కొండాపురం సిఐ వేణుగోపాల్ తెలిపారు. తాళ్ల పొద్దుటూరు పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న వరప్రసాద్, కొండాపురం పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న సుధా వరప్రసాద్‌పై అవినీతి ఆరోపణలు రావడంతో.. ఎస్‌పి వీరికి సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు.

క్రమశిక్షణతో ఉన్నత స్థాయికి ఎదగాలి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని ఎస్ఐ రోషన్ పేర్కొన్నారు. సింహాద్రిపురం జడ్పీ హైస్కూల్లో గురువారం సెక్యూరిటీ అండ్ సేఫ్టీపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులు మొబైల్ ఫోను అవసరాలకు అనుగుణంగా వినియోగించి, నూతన విషయాలు తెలుసుకోవాలన్నారు. సైబర్ నేరాలపై విద్యార్థులకు క్షుణ్ణంగా వివరించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన దిశ యాప్ ఉపయోగాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు మహేశ్వరమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్ఐ రోషన్

భక్తులకు అన్నదానం చేస్తున్న ఆలయ సిబ్బంది

కమనీయం.. శ్రీనివాసుని కల్యాణం

- పది వేల మందికి అన్నదానం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పట్టణంలో వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఐదు రోజులుగా జరుగుతున్న అష్ట బంధన మహా కుంభభిషేకం కార్యక్రమంలో భాగంగా గురువారం ఆరవ రోజు దేవదేవుడైన కలియుగ దైవం శ్రీదేవి, భూదేవి సమేత వెంకటరమణుడి కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. తేలూరు గ్రామానికి చెందిన బివిఎస్ఆర్ లారీ ట్రాన్స్‌పోర్ట్ యజమాని, భారతి సిమెంట్ కాంట్రాక్టర్ బివి సుబ్బారెడ్డి, ఆయన సతీమణి వెంకట ప్రమీల, చంద్రఓబులరెడ్డి సతీమణి నారాయణమ్మ, లక్ష్మిరెడ్డి ఆయన సతీమణి లత, మన్మథ రెడ్డి ఆయన సతీమణి మహాలక్ష్మి, ప్రహ్లాదరెడ్డి ఆయన సతీమణి లత, కిరణ్‌రెడ్డి ఆయన సతీమణి మమత, భూమిరెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు వరదాచార్యుల స్వామి కల్యాణాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంకాలం గ్రామోత్సవాన్ని నిర్వహించారు.

ఎసిబి డిఎస్‌పికి వినతిపత్రమిస్తున్న ఆర్‌టిఐ జిల్లా ఇన్‌ఛార్జి రామచంద్ర

సమాచార హక్కు చట్టాన్ని వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - వేంపల్లె

సమాచార హక్కు చట్టాన్ని అధికారులు వేగవంతం చేయాలని కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ జిల్లా ఇన్‌ఛార్జి గూడూరు రామచంద్ర పేర్కొన్నారు. అవినీతిని నిర్మూలించాలంటూ గురువారం కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ ఆధ్వర్యంలో కడప నగరంలోని ఎసిబి డిఎస్‌పికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం సరిగా అమలు కావడం లేదన్నారు. అధికారులు చేసే అవినీతిపై నిరంతరం నిఘా పెట్టాలని కోరారు. ప్రజల ఫిర్యాదులకు వెంటనే స్పందించి అవినీతిని అరికట్టేందుకు చర్యలు తీసుకుంటామని ఎసిబి డిఎస్‌పి హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ఎసిబి నెంబర్లు పెడతామని చెప్పారన్నారు. వినతిపత్రం సమర్పించిన వారిలో ఆర్‌టిఐ సభ్యులు కొండయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పథకాల గురించి వివరిస్తున్న టిడిపి నాయకులు

అమృత్‌నగర్‌లో టిడిపి నాయకుల పర్యటన

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

అమృత్‌నగర్‌లో ప్రొద్దుటూరు టిడిపి ఇన్‌ఛార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి భార్య మౌనిక, అక్క హరిత గురువారం పర్యటించారు. బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా వారు టిడిపి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సాన రమణారెడ్డి, శంకర్‌రెడ్డి, అమలి ఓబులేసు, సుందరం, దానం, ఈశ్వరయ్య, మద్దిలేటి మేస్త్రి ఫక్రుద్దీన్, ప్రసాద్, భానుమతి, పాల సుబ్బారాయుడు, డాక్టర్ శ్రీనివాస ఆచారి, నాగరాజ ఆచారి, కడప జిల్లా అధికార ప్రతినిధి ఆవుల దస్తగిరయ్య, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి తాటి శ్రీనివాసులు యాదవ్, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

విభిన్నప్రతిభావంతులకు దుస్తులు అందిస్తున్న భారతమ్మ

ఘనంగా వైఎస్.జార్జిరెడ్డి వర్ధంతి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్‌రెడ్డి సోదరుడు వైయస్ జార్జిరెడ్డి 24వ వర్ధంతి వేడుకలను గురువారం పులివెందులలో వైయస్ కుటుంబ సభ్యులు ఘనంగా నిర్వహించారు. శ్మశానవాటికలో వైయస్ జార్జిరెడ్డి సమాధిపై ఆయన సతీమణి వైయస్ భారతమ్మ, ఇసి సుగుణమ్మ వైయస్ కుటుంబ సభ్యులు పుష్పగుచ్ఛాలు ఉంచి ఘనంగా నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం విభిన్నప్రతిభావంతులకు దుస్తులు పంపిణీ చేశారు. కళాశాల కార్యాలయంలో ఏర్పాటు చేసిన జార్జిరెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. కళాశాలలో అన్నదానం నిర్వహించారు. కార్యక్ర మంలో విభిన్నప్రతిభావంతుల నెట్ వర్క్ రాష్ట్ర అధ్యక్షులు ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి, ఎస్టేట్ మేనేజర్ వెంగమునిరెడ్డి, వైఎస్సార్ ఫౌం డేషన్ జనార్ధన్‌రెడ్డి, పార్న పల్లె నాయుడు, ఐటిఐ కళా శాల ప్రిన్సిపల్ రవిశంకర్, అధ్యాపకులు ఆంజనేయులు, సాయి, రామచంద్ర, రాజగోపాల్‌రెడ్డి, బ్రదర్ రఘుకర్, వేముల శ్రీనివాసరాజు, వెంకట సుబ్బయ్య పాల్గొన్నారు.

శ్రీచంద్రమౌళీశ్వరస్వామి దేవాలయం
పెద్దపసుపుల(గ్రా),పెద్దముడియం(మం), కడప జిల్లా.
e-Procurement Tender
NIT NO.B24440/2019/Adm Dt:10.07.2019
దేవాలయము నందు రిపేర్లు చేయుట కొరకు e-Procurement ద్వారా టెండర్లు కోరడమైనది. వివరములకు https://tender.apeprocurement.gov.in వెబ్‌సైట్‌ను చూడగలరు.
ఇట్లు : కార్యనిర్వహణాధికారి

NAME CHANGE
MY WIFE NAME IS **ZAINAB KODAVENDLA (OLD NAME)** W/O BEPARI SHOUKATH ALI CHANGED MY WIFE NAME IS NOW **NOORJAHAN KODAVENDLA (NEW NAME)** R/O.D. NO.10/120 BEPARI STREET, JAMMALAMADUGU, YSR DISTRICT-516434 ANDRA PRADESH, INDIA.